


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సంత గోల

**మాయదారి సంత** అని తిట్టేవారు చిన్నప్పుడు, అది ఎందుకో నాకు ఇప్పటికీ తెలీదు. కానీ మా ఆయనకి సంతకి వెళ్ళడం. అదీ నాతో కలిసి వెళ్ళడం చాలా ఇష్టం. ఆయనతో ఏ ఎగ్జిబిషన్‌కో వెళ్తే అంగదుడిలా అంగలు వేసుకుంటూ "ఏవండీ ఈ చీర ఎంత బావుందో చూడండీ" అనేలోపే ఓ నాలుగు షాపులు దాటి జనంలో కలిసిపోయే మనిషి. ఈ సంతకి వెళ్ళినప్పుడు మాత్రం తప్పిపోతానేమో అన్నంత జాగ్రత్తగా నా కొంగు పట్టుకునే వుంటారు పక్కన.

"సొరకాయ బావుంది చూడు. ఎంత పొడవుందో" అంటారా, దానికి మా నానమ్మ వయసుంటుంది. అది అమ్మేవాడితో మాట్లాడ్తూనే, నెమ్మదిగా గిల్లి చూడాలి. లేతగా వుందో లేదో తెలీడానికి, ఇవన్నీ ఆయనకి తెలీదు. "లావు లావు ములక్కాడలు" అని నిన్న కొనుక్కొచ్చారు. వాటి నిండా విత్తనాలే. వంకాయలు ఆయన కిలో తెస్తే అరకిలో పుచ్చులే. కానీ ఆయన వాదన 'బిగ్ బాస్కెట్'లో నీ కొడుకు ఆర్డర్ ఇచ్చినా, రతన్‌దీప్‌లో నువ్వు తెచ్చినా, పాకెట్‌లో ఏమున్నాయో నీకు తెలుసా?" అని.

ఆయనకి నిజానికి ఈ సంతలో కూరగాయలు అమ్మేవాళ్ళమీద ప్రేమ. మొన్న వానొస్తే దోసకాయలూ, టమాటాలూ సంచుల్లో, రోడ్డుమీదే వదిలేసి పారిపోయారుట పాపం. అదే మనం "పదిరూపాయలకి పావుకిలో" అంటే "తొమ్మిదికి ఇస్తావా?" అంటే ఇవ్వను అంటారు.

ఆకుకూరలు "పదికి మూడు అమ్మా తోటకూర" అంటారు.

"నాలుగిస్తావా?" అంటే "కొనే మొకమేనా?" అంటారు.

అలాంటిది మొన్న నాలుగు రోజులు ముసురొస్తే, అవన్నీ కుళ్ళిపోయాయని, కిందపారేసి వెళ్ళిపోయారు. ఇంక సంతకి వెళ్తే "రమణీ!.. ఎలా వున్నావ్?" అనే మా పాత స్నేహితులు కనిపిస్తారు. మాతోబాటు ఇళ్ళు కట్టుకున్నప్పటి వాళ్ళూ. "రమణీగారూ!" అంటూ ఆ తరువాత వచ్చిన వాళ్ళూ పలకరిస్తారు.

"ఈవిడ నటరాజన్ గారి మామీ అండీ" అంటాను.

"ఆయన బావున్నారా?" అంటారీయన.

"ఆయన కాలం చేసి నాలుగేళ్ళుదా అయిందిగా బాబూ" అని మామీ కళ్ళూ ముక్కూ తుడుచుకుంటుంది. నేను 'మిరప్పండు' అంత ఎర్రగా చూస్తాను. ఎదురుగా గుమ్మడి చెక్కలా ఆవిడ కనిపిస్తుంటే "మీ ఒంట్లో ఎలా వుందీ? ఎలా వున్నారు?" అని అడగొచ్చుగా, పోయిన వాళ్ళాయన సంగతెందుకు సంత?

ఇంకో చోట గోంగూర బేరం చేస్తూంటాం. నా మొహం బేరం. అది "పదికి పది" అంటే "పదకొండియ్యి" అంటాం. ఏం ఒరిగిపోయిందా కట్టలో. అయినా అదో తృప్తి. ఇంతలో భుజం మీద చెయ్యి పడ్తుంది "బావున్నారా... బావగారు కూడా వచ్చారా? నమస్కారం.. నేను గిరిజనండీ" అంటుంది.

"ఏ గిరిజా?" ఈయన.

"మీ పక్క సందులో చివర నాలుగో ఇల్లు కుడిపక్కకి, అక్కడ వుండే మాణిక్యాలరావుగారి చిన్నకొడుకు చలపతి భార్యనండీ"

నా మనసులో "గోవింద" ఈయనకి మా అన్నయ్య రెండో కొడుకు భార్యపేరు తికమక, స్నిగ్ధని తేజ అనీ తేజని స్నిగ్ధనీ అంటారు. అప్పటికీ నేనూ మా అన్నయ్యా ఫ్యామిలీ ప్లానింగ్ పాటించినా కూడా ఆ ఇద్దరిలోనే కన్ఫ్యూజన్.

ఆ అమ్మాయి ఇంకో అడుగు ముందుకేసి "మీరు మా ఇంటికొచ్చారు బావగారూ" అంది.

ఈయనకి పోయిన నెలలో మేం వెళ్ళిన ఓ ఇల్లు చటాలున మస్తిష్కంలో మెదిలింది. ఆ బుర్రగోక్కుంటే, అది ఏదో ఒకటి మెదిలేట్టు చేస్తుంది మరి.

"ఓ సారీ అవును పోయిన నెల మీ మావగారు పోయినప్పుడొచ్చాం.. కరెక్టే"

నేను వెంటనే నా చెప్పు కాలుతో ఆయన కాలు తొక్కి "ఆయన శేషగిరిరావుగారు. వీళ్ళ మావగారు మాణిక్యాలరావుగారు"

ఆ అమ్మాయి చిన్నబుచ్చుకుని "మా ఇంట్లో మా మరిది వడుగుకొచ్చారు" అంది.

"ఓసారీ! అయితే మీ మావగారు బావున్నారా?" అసలు ఈయనకి వాళ్ళ మావగారి గోలెందుకూ? చిలగడ దుంపలా వున్న ఈ పిల్లని, మీ పిల్లలేం చదువుతున్నారమ్మా? మీరెలా వున్నారూ?" అని అడగొచ్చుగా.

ఆ అమ్మాయి నిట్టూర్చి "మావయ్యగారికి స్ట్రోక్ వచ్చిందండీ. అపోలోకి తీసుకెళ్ళాం. మాట సరిగ్గా రావడంలేదండీ. మొదట విజయాలో చూపించామండీ"

ఆ వాగ్దాటి ఆగేటప్పటికీ నా చేతిలో బీరకాయ గిడసబారి, ఎండిపోయింది. ఈయన పరమ శ్రద్ధగా వింటున్నాడు. "అయ్యయ్యో అపోలో హైదరగూడాలో మా రమణికి తెలిసిన న్యూరో సర్జన్ వున్నారు. కావలిస్తే నేనొస్తా ఈసారి మీరెళ్ళేటప్పుడు చెప్పండి" అంటూ రేపు ఆ అమ్మాయి మళ్ళీ సంతలో కనిపిస్తే "ఎవరు నువ్వు?" అన్న చూపు చూస్తారు. పక్కన నేనుండి చెప్పకపోతే.

ఇంకాస్త దూరంలో మొక్క జొన్నపొత్తులు కాలుస్తున్నాడు అని నా స్టెప్పులు అటేస్తే, ఈయన, ఒక ఆవిడ నన్నూ, ఈయన్నీ చూసి నవ్వగానే పలకరించారు "బావున్నారా?"

ఆవిడ "బావున్నాం అండీ"

"అక్కడే వున్నారా?"

"అక్కడే వున్నాం అండీ."

"పిల్లలు ఆ స్కూలేనా?"

"ఆ.. ఆ స్కూలే, మీ అబ్బాయిలూ?"

"ఒకడు అమెరికాలో.." నా వైపు చూస్తారు. నేను మొక్కజొన్నపొత్తులు చూస్తూ "కేలిఫోర్నియాలో శానోజేలో"

ఈయన "రెండోవాడు జూబ్లీహిల్స్‌లో.. మా వూళ్ళోనే"

నేను కల్పించుకుని "కాదు మొదటివాడు ఈ ఊళ్ళో, రెండో వాడు శానోజేలో."

ఈయన "అంతే.. అంతే"

ఆవిడ "వదినగారు బొత్తిగా బిజీ అయిపోయారు. లేకపోతే వరలక్ష్మీ వ్రతం పేరంటాలలో కలిసేవారు"

ఈయన "లేదు.. వస్తుంది. అసలు వద్దాం అనే అంది ఈ మధ్యన.."

ఆవిడ ఆనందంగా "అయితే ఆదివారం రండి. మీ కోసం పాలకూర కొంటాను. పకోడీలు వేస్తాను"

"నాకు ఉల్లిపాయ పకోడీలు ఇష్టం"

"సరే అన్నయ్యగారూ.. అవీ వేస్తాను"

నేను ఆకాకరకాయలు కనిపించి అటెళ్ళాను. నేను సంచీ బరువెక్కి ఇటొచ్చేసరికి ఆవిడ వాళ్ళాయనకి అయిన బైక్ ఏక్సిడెంట్ గురించి చెప్తోంది "సుబ్బారావుగారికి అంత పెద్ద ఏక్సిడెంట్ అయినా, మా పక్కింటి గోవిందరాజుగారు కానీ వాళ్ళ ఆవిడ మందాకిని గారుకానీ అసలు 'ఎలా వున్నారు?' అని మాట వరసకైనా అడగలేదు అన్నయ్యగారూ" అని కళ్ళు వత్తుకుంది.

ఈయన బాధగా, నేను రాగానే "పాపం గోవిందరాజుగారికి పెద్ద ఏక్సిడెంట్ అయిందట, ఆవిడ బాధపడ్తున్నారు"

ఆవిడ బిత్తరబోయి "గోవిందరాజుగారు మా పక్కింటాయన అన్నయ్యగారూ, బైక్ ఏక్సిడెంట్ మా అయనకి అయింది.. సుబ్బారావుగారికి" అంది.

"అదదే. సుబ్బారావుగారికి" అన్నారు.

ఆవిడ ముక్కు తుడుచుకుని, "ఆదివారం తప్పకుండా వస్తారు కదూ.. పాలకూరతోబాటు ఉల్లిపాయలూ కొంటున్నా" అని నవ్వి వెళ్ళిపోయింది.

"తప్పకుండా వస్తాం" అని హామీ ఇచ్చి ఈయన, ఆవిడ వెళ్ళాక నావైపు తిరిగి "ఎవరావిడా?" అన్నారు. నాకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు.

"మరి అక్కడే వున్నారా?, పిల్లలు బావున్నారా? అదే స్కూలా?" అని అన్ని ముచ్చట్లు అడిగారుగా.

"అవును.. కానీ ఎక్కడా ఆవిడ తెలీలేదని నేను బయటపడలేదుగా" గర్వంగా అన్నారు.

"అసలంతసేపు మాటలెందుకని?"

"నువ్వే అన్నావుగా? అస్తమానం ఇంట్లో కూర్చుని టీ.వీ పేపర్ చూడడం కాదు. సంఘజీవితం వుండాలని, సొసైటీ తెలియాలనీ"

"అయితే మాత్రం మనకి తెలీని సొసైటీ అని అర్థంకాదు. మనకి తెలిసిన సొసైటీ."

"ఆవిడ తెలీకుండానే నవ్విందంటావా?"

"ఆవిడకి నేను రచయిత్రిగా తెలుసు. అంతమాత్రాన ఆదివారం మీ ఇంటికొస్తాం అని మాటిచ్చేస్తారా? పైగా పాలకూరతోకాదు ఉల్లిపాయలతో పకోడీలు వెయ్యమన్నారు."

"అవును ఉల్లిపాయ పకోడీలు బావుంటాయి."

"ఇంతకీ ఎవరావిడ? ఇల్లెక్కడని వెళ్తాం?"

"అబ్బా! మనం మనింట్లో ఉల్లిపాయ పకోడీలు వేసుకుని తిందాం. ఆవిడ మన పేరుతో వాళ్ళ ఆయనకీ, పిల్లలకీ చేసి పెడ్తుందిలే. ఇప్పుడేం ముంచుకుపోయిందనీ?"

ఇలా కొన్ని సంభాషణలు.

నాకు దోసకాయల బండి చూడగానే మా సుశీలగారి భర్త గుర్తుకొస్తారు. "సుశీలా దోసకాయలు కొను" అనేవారు. ఆయనకి ఎన్ని కూరలు కొన్నా దోసకాయలు కొనాల్సిందే నేనూ సుశీలా ఏ మిర్చీ బజ్జీ బండి పక్కనో నిలబడి, గంటలతరబడి కొడుకులూ, కోడళ్ళ గురించి మాట్లాడుకుంటుంటే ఆయన మెడమీద పొట్లకాయ, అచ్చంగా సినిమాలోలా వేసుకుని, రెండు సంచులనిండా కూరలు కొనుక్కుని వచ్చేవారు. అలాంటిది ఆయన సడెన్‌గా కాలం చేసేటప్పటికి సుశీల కూడా రావడం మానేసింది.

అలాగే నంబియార్‌గారూ, మామీ వృద్ధ పార్వతీపరమేశ్వరుల్లా, తోపుడు బండీ తోసుకుంటూ సంతకొచ్చేవాళ్ళు. ఆవిడ ముక్కుకున్న బేసరి మెరుపు చూడ్డం ఇష్టం నాకు. అందుకే 'వణక్కం మామీ, మామా" అంటూ కాసేపు మాట్లాడేదాన్ని. వరలక్ష్మీ వ్రతానికి మామీ చేసే శెనగల ప్రసాదం మరచిపోలేను. చింతపండు పులుసు వేసి, ధనియాల పొడివేసి, ఉడికించిన సెనగలు పోపులో వేసి దొన్నెల్లో పెట్టిచ్చేవారు. తెల్లని జుబ్బా ధోవతిలో, విభూది కట్లతో మామా మెరిసిపోయేవారు.

మొదట మామీ ఆయన్ని మోసం చేసి వెళ్ళిపోయింది. దాంతో ఆయన ఒక్కరే మాసిన గెడ్డంతో మరకలు పడ్డ చొక్కాతో, మనవరాలితోనో, మనవడితోనో మామా కొన్నాళ్ళొచ్చాకా, రావడం మానేసారు. నేను వాళ్ళ కోడలిని కనుక్కుంటే, "ఒంట్లో బాలేదు, డయాలసిస్ మీదున్నారు" అని తెలిసింది.

కొత్తగా గుడి పక్క వీధిలో ఓ అమెరికన్ స్వామి తెల్లని మొహం మీద నిలువుగా తిరుచూర్ణం పెట్టుకుని, హరేరామ.. హరే కృష్ణ డ్రెస్సులో, పంచె కట్టుకుని, జుబ్బా మీద, నున్నని చలివిడి ముద్దలాంటి గుండుతో, మధ్యలో వంకాయ ముచికలాంటి పిలకతో, పక్కన చెవుల్లో దూది పెట్టుకున్న బాలింతరాలు భార్య, చామనఛాయలో వున్న ఆ అమ్మాయి మడమల మీదకి చీరకట్టుకుని, పల్లెటూరి యాసలో, అనకాపల్లినుండొచ్చినట్లు బేరాలాడ్తోంది. ఆమెతో చిన్న స్కూటీ మీదొస్తున్నాడు. నేను ఓసారి మాట్లాడాను అందుకే నన్ను చూడగానే "హరేకృష్ణ" అని చేతులు జోడిస్తాడు. వయసు ఇరవై ఎనిమిదో, ఇంకా తక్కువో వుండచ్చు. ఎక్కడ అమెరికా? ఎక్కడ నేరేడ్‌మెట్ సంత? అందుకే మా అమ్మమ్మ అనేది "నీళ్ళ ఋణం... నిద్ర ఋణం"అని. ఆ ఋణం పిలక కట్టుకు ఈడ్చుకొస్తుంది ఎంత దూరమైనా.

లేత లేత వంకాయలు జాగ్రత్తగా, అతి సుతారంగా, ముచ్చిక దగ్గర పట్టుకుని ఏరుతున్నాడు 'కృష్ణస్వామి'

"యూనో హౌ టు మేక్ క్రీ?" అడిగాను.


అతను నవ్వి "వీ విల్ బాయిల్. ఎండ్ పుట్ సమ్ సాల్ట్ అండ్ పెప్పర్ ఆన్ దెమ్" అన్నాడు.


సున్నితంగా, సుకుమారంగా వున్న బెండకాయలని కొన్నిసార్లు నాకు తరగబుద్దికాదు. పుష్పవిలాపంలా ఆ కూరల కుత్తుకలు కత్తిరిస్తే అవి రోదిస్తాయేమోనని బాధగా వుంటుంది.

మా వారికోసం చుట్టూ చూస్తే ఆయన కంద దుంప కోయిస్తున్నారు. ఆయనకి సంత అయిన మరునాడు వాళ్ళక్కచేత కందరొట్టి కాల్పించుకోవడం అలవాటు. నేను చింతచిగురూ, వాక్కాయలూ, కొత్త చింతకాయలూ, ఆకాకరకాయలవైపు పరుగెడ్తాను. నాకు ఎప్పుడో తప్ప దొరకని కూరలంటే ఆసక్తి ఎక్కువ.

"పంతులమ్మా బావున్నావా? ఈమధ్య పిలుస్తలేవు" అని చీపుర్లు అమ్మే అనంతం, "బిడ్డలు బాగున్రా అమ్మా? కృష్ణబాబు లగ్గం అయిందా?" అంటూ మా ఇంట్లో చేసి మానేసిన పాత పనిమనిషి అంజమ్మా, "ఆ సంచీ ఇటియ్యి నేనింటిదాకా తెస్తాలే" అని వచ్చి నా చేతిలో సంచి లాక్కునే వరాలూ. కాలనీ ప్రెసిడెంట్ రామచంద్రరావుగారూ.. వాళ్ళ ఇళ్ళల్లో శుభకార్యాలూ కొత్తగా వచ్చిన జబ్బులూ పాతబడిన మా స్నేహాలూ ఇలా వారానికి ఓసారి రివైజ్ చేసుకోడానికి ఈ వారం వారం 'సంత' ఉపయోగపడ్తుంది. కొంతమంది కలుస్తారు. కొంతమంది మాయం అవుతూ వుంటారు.

Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IuIS4